ఒలింపియాడ్‌లో వివేకానంద విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు పలువురి అభినందన

ప్రజాశక్తి- రాజోలు

గోదావరి ఒలింపియాడ్లో రాష్ట్ర స్థాయిలో మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. గత డిసెంబర్ లో జరిగిన గోదావరి ఒలింపియాడ్‌లో తొమ్మిది, పది తరగతి విద్యార్థులు తాడి ప్రిన్స్, నల్లి దీక్షిత గోదావరి తెలుగు, హిందీ ఒలింపియాడ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఇరువురిని పాఠశాల కరెస్పాండెంట్ పివివి.వరప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, పద్మజ, తలిదండ్రులు అభినందనలు తెలిపారు.

అంతిమ శ్వాస విడిచిన నాగాంజలి

- 12 రోజులు పాటు మృత్యువుతో పోరాటం
- నాటకీయ పరిణామాల నడుమ మృతదేహం తరలింపు
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి సిపిఎం డిమాండ్



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

బొల్లినేని ఆసుపత్రిలో ఉద్యోగి లైంగిక వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఫార్మా విద్యార్థి నాగాంజలి శుక్రవారం తుది శ్వాస విడిచింది. 12 రోజుల పాటు మత్యువుతో పోరాడిన ఆమె చివరకు ప్రాణాలను విడిచింది. నాగాంజలి మృతి తోటి విద్యార్థులు, ఆమె తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచేసింది.

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం గ్రామానికి చెందిన నాగాంజలి రాజమహేంద్రవరం సమీపంలోని మధురపూడి వద్ద వికాస్ ఫార్మసీ కళాశాలలో ఫార్మా-డి పైనలియర్ చదువుతోంది. రాజమహేంద్రవరంలోని కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తోంది. ఈ క్రమంలో బొల్లినేని ఉద్యోగి దీపక్ కన్ను ఆమెపై పడింది. ప్రేమ, పెళ్లి పేరుతో ఆమెను నమ్మించి వంచించాడు. లైంగిక దాడులకు పాల్పడ్డాడు. ఇది భరించలేని నాగాంజలి గత నెల 23న విబి 10 ఎమ్‌జి ఇంజక్షన్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి నుంచి అపస్మారక స్థితిలోనే ఉంది.వెంటనే గమనించిన సహచరులు ఆమెను ఐసియుకి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాగాంజలి కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రి వద్ద ఆందోళనలు చేశారు. పోలీసులతో ఈ ఆందోళనకు అణచే ప్రయత్నం జరిగింది. ఎట్టకేలకు నాగాంజలి సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు దీపక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

ఈ ఘటన సోషల్ మీడియా, పత్రికల్లో వైరల్ కావడంతో కలెక్టర్ స్పందించారు. నాగాంజలి వైద్య పర్యవేక్షణకు ప్రభుత్వ వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ బృందం పర్యవేక్షించింది. గత నెల 30 వరకూ నిలకడగా ఉన్న నాగాంజలి ఆరోగ్యం క్రమంగా విషమించిందని వైద్యుల బృందం తెలిపింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమె తుది శ్వాస విడిచింది.

ఆసుపత్రి వద్ద నాటకీయ పరిణామాలు

పోస్టుమార్టం కోసం నాగాంజలి మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సమయంలో అక్కడ నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. పోస్టు మార్టం కాకుండానే మృతిరాలి తల్లిదండ్రులు, ఆమె దగ్గర బంధువులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీని వెనుక పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలు కలిగాయి. పోస్టుమార్టం అనంతరం నాగాంజలి మృతదేహాన్ని ఎవరికీ చూపించలేదు. అక్కడి చేరుకున్న తోటి విద్యార్థులు, సిపిఎం, సిపిఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఇతర ప్రజా సంఘాల నాయకులు కోరినా పోలీసులు అంగీకరించలేదు. మృతదేహాన్ని చూపించాలని అంబులెన్స్‌ను అడ్డుకున్న నాయకులను పోలీసులు పక్కకు నెట్టేసి అంబులెన్స్‌ను అక్కడ నుంచి హుటాహుటిన తరలించేశారు. ఈ ఘటనపై వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. మృతదేహాన్ని సైతం చూపించకుండా తరలించడం శోచనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి : సిపిఎం

ఫార్మా విద్యార్థి నాగాంజలి మృతి బాధాకరమని, ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు టి.రాజేష్ తదితరులతో కలిసి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో నాగాంజలి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. పోస్టుమార్టం అయ్యేవరకు అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోస్టు మార్టం కాకుండానే తల్లిదండ్రులు, బంధువులు వారి గ్రామానికి వెళ్లిపోయారని, దీని వెనుకు పోలీసులు, యంత్రాంగం ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానం కలుగుతుందన్నారు. మృతదేహాన్ని ఎవరికీ చూపించకుండా తరలించేయడం శోచనీయమన్నారు. నాగంజలి మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సూసైడ్ నోట్‌లో వెల్లడించిన విషయాలతో పాటు, సిసి టివి ఫుటేజీ, తోటి విద్యార్థులతో మాట్లాడి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో పాటూ కిమ్స్ యాజమాన్యం కూడా బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట ఎస్ఎఫ్ఐ నాయకులు జోసఫ్, జ్యోతి, సిపిఎం నగర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై ఆందోళన



పోలీసుల తీరును నిరసిస్తూ సిపిఎం, సిపిఐ, ఐద్వా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, డివైఎఫ్ఐ ఇతర ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడారు. సిసి టివి ఫుటేజ్‌ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. నాగాంజలి ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తులసి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడిసునీల్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి రాజమ్మ, మంగ పాల్గొన్నారు.



ఎక్సైజ్ డిఎస్‌పి ముందు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న మహిళలు

మద్యం షాపును తొలగించాలి

- సిపిఎం ఆధ్వర్యంలో మహిళల ఆందోళన
- ఎక్సైజ్ డిఎస్‌పికి మహిళల హెచ్చరిక

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మండలం మాచవరం గ్రామం వెంకటేశ్వర కాలనీ కుసుమేవారిపేట చినకుసుమేవారి పేటలకు ఆనుకుని ఉన్న మద్యం షాపును తక్షణమే తొలగించాలని శుక్రవారం ఎక్సైజ్ డిఎస్‌పి ముందు సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు హాజరై మద్దతు తెలిపారు. గురువారం అమలాపురం ఎక్సైజ్ సూపర్డెంట్ కార్యాలయం వద్ద మహిళలు నిరసన తెలపడం విదితమే ఈ సందర్భంగా ఎంక్వయిరీకి వచ్చినటు వంటి ఎక్సైజ్ డిఎస్‌పి ఎదుట గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ కారెంవెంకటేశ్వరరావు మాట్లాడుతూ తక్షణం మహిళలు రక్షణ లేని విధంగా ఏర్పాటు చేసిన మద్యం షాపుని తక్షణమే ఇక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎటువంటి పంచాయతీ అనుమతులు తీసుకోకుండా అంబాజీపేట నుంచి ఇక్కడికి షాపును షిఫ్టింగ్ చేశారని అన్నారు. ఒకపక్క స్కూలు, మరోపక్క అంబేద్కర్ విగ్రహం ఇరువైపులా గ్రామాలు ఉన్న ప్రజలకు మహిళలకు ఇబ్బంది కరంగా ఉన్న స్థలంలో అక్రమంగా మద్యం షాపును ఏర్పాటు చేయడం హాస్యాస్పదమన్నారు. పైగా విచారణకు వచ్చినటువంటి ఎక్సైజ్ డిఎస్‌పి గ్రామానికి 150 మీటర్లు దూరంలో మద్యం షాపు ఉంటే మీకేంటి అభ్యంతరం అని మహిళలు ప్రశ్నించారు. దీంతో మహిళలంతా డిఎస్‌పికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణం మహిళలకు రక్షణ లేనటువంటి మద్యం షాపుని ఇక్కడ నుంచి తొలగించాలని లేనిపక్షంలో మద్యం షాపు ఎదురుగా ప్రత్యక్ష ఆందోళన చేపడుతామన్నారు. మద్యం షాపును తొలగించే విధంగా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతి నిధులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఎక్సైజ్ డిఎస్‌పికి ముందు ఆందోళన చేపడుతున్నటు వంటి మహిళలను అక్కడకు వచ్చినటువంటి ఒక మందు బాబు అసభ్యకరంగా ఫొటోలు చిత్రీకరించి అసభ్యకర పదజాలంతో దూషించాడు. దీంతో ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాచవరం వెంకటేశ్వర కాలనీ కుసుమే వారి పేట,చినకుసుమేవారి పేట గ్రామాలకు చెందిన కుసుమ నాగమణి, అయితా బత్తుల శాంతికుమారి, జ్యోతి, పేయ్యిల మారతమ్మ, మెడిద బాల విజయ కుమారి, అయితాబత్తుల నవీన్, సరేళ్ల సత్య నారాయణ, అయితా బత్తుల శ్రీను, మేడిద శ్రీను, సరేళ్ళ వీర్రాజు, గోగి రాజేష్, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

చలివేంద్రాన్ని ప్రారంభించిన సిఐ

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆలయ ప్రాంగణంలో రామానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని అమలాపురం సిఐ పి.వీరబాబు శుక్రవారం ప్రారంభించారు. ద్వారంపూడి బాలమురళి శ్రీనివాసరెడ్డి సమకూర్చిన కొబ్బరి బొండాలను బాటసారులకు, యాత్రికులకు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్య నాయుడు, యర్రంశెట్టి నారాయణమూర్తి, తిక్కిరెడ్డి నేతాజీ, ముత్యాల గంగాధర్, నిమ్మకాయల నాని,మానే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై కార్యాచరణ ప్రణాళిక

ప్రజాశక్తి కథనంపై స్పందన

ప్రజాశక్తి - రామచంద్రపురం



ఎంపిడిఓ శ్రీనివాస్

'గోదావరి చెంత ఉన్న తాగునీటి చింత' అన్న శీర్షిక శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథ నానికి ఎంపిడిఓ నందమూరి శ్రీనివాస్ స్పందించారు. ఆయన మాట్లా డుతూ మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండటంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. దీనిపై నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అంద జేస్తామన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ఆర్ డబ్ల్యుఎస్ అధికారులు సమీక్షించుకుని తాగు నీటి సమస్య పరిష్కారం కృషి చేయాలన్నారు.

పరిష్కారానికి నోచుకోని తాగునీటి సమస్య

వాడివేడిగా కె.గంగవరం మండలం సమావేశం

ప్రజాశక్తి - కె.గంగవరం

వేసవిలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎన్నో ఏళ్లుగా సమస్య పరిష్కారం కావడం లేదని పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో ధ్వజ మెత్తారు. కె.గంగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపిపి పంపన నాగమణి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాతకోట సర్పంచ్ మల్లిడి వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఏటా పాతకోటకు త్రాగునీటి కష్టాలు తప్పడం లేదని, గ్రామస్తులు దీనిపై ఎన్నిసార్లు చెప్పినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అదేవిధంగా కూళ్ల గ్రామంలోనూ త్రాగేందుకు నీరు పనికి రావడం లేదని, గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు మొదలై రెండేళ్లయిన పూర్తి కాలేదని, వాటర్ ట్యాంక్ నిర్మించలేదని గ్రామ సర్పంచ్ చెల్లే నాగేశ్వరరావు అధికారులు నిలదీశారు. ఎర్ర పోతవరంలో ఎస్సీ కాలనీ, పంపన వారి పాలెం, కుడుపూరు కొంపలు, జంగమ కాలనీలో మంచినీటి సరఫరాలేదని పైప్ లైన్లు పునరుద్ధరించలేదని, గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు తెలిపారు. కుందూరుకు రూ.75 లక్షలు కేటాయించిన నేటికీ పనులు పూర్తిగా లేదని సర్పంచ్ సత్యానందం తెలిపారు. సుందరపల్లి, కుందూరు, అముజూరు, ఉడుముడి, మసకపల్లి, తామరపల్లి, కుడుపూరు,వంటి అనేక గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కరించాలని ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు సభలో డిమాండ్ చేశారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ రాహుల్ మాట్లాడుతూ మంచినీటి సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులతో కలిసి కృషి చేస్తామన్నారు. అదే విధంగా జలజీవన్ మిషన్ పనులను కాకినాడకు చెందిన విబి కన్స్ట్రక్షన్స్ కంపెనీ చేపట్టిందని వారు పనులను నత్త నడకన కొనసాగిస్తున్నారు అన్నారు. అదేవిధంగా మండల పరిషత్ నుంచి అత్యవసర నిధులు రూ.2 లక్షలు కేటాయించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ నిధులతో ట్యాంకుల ద్వారా శివారు ప్రాంతాలకు మంచినీళ్ల సరఫరా చేస్తామన్నారు. సభలో వ్యవసాయ శాఖ అధికారి బలుసు రవి దాల్వా పంటలు కోతకు సిద్ధమయ్యాయని కొన్నిచోట్ల సాగునీటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ, గృహ నిర్మాణ శాఖ ఎఇ తదితరులు ప్రసంగించారు. సమావేశంలో జడ్‌పిటిసి సభ్యురాలు ఓబులనేని వరలక్ష్మి, ఎంపిడిఓ ఎన్. శ్రీనివాసు, డిప్యూటీ తహశీల్దార్, మండల ఉపాధ్యక్షులు దూడల నాగేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న కూళ్ల సర్పంచ్ చెల్లి నాగేశ్వరరావు

రూ.2 లక్షలు మంజూరుకు సభ ఆమోదం

వేసవిలో మంచినీటి అవసరాలు తీర్చేందుకు ఆర్డబ్ల్యూఎస్ శాఖకు మండల పరిషత్ నుంచి రూ.2లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపింది.



చెక్కు అందజేస్తున్న గుడ్‌సీడ్ ఫౌండేషన్ సభ్యులు

కిడ్నీ బాధితునికి 'గుడ్ సీడ్' రూ.25 వేల సాయం

ప్రజాశక్తి - అల్లవరం

కిడ్నీ బాధితునికి గుడ్‌సీడ్ ఫౌండేషన్ తరఫున శుక్రవారం రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. గుండెపూడి పోతులవారి పేట కు చెందిన నీతిపూడి సురేష్ కు రెండు కిడ్నీలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణా రావు కిడ్నీ బాధితుడు సురేష్ వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. రమణారావు అందించిన రూ.25 వేల చెక్కును గుండెపూడి పోతుల వారి పేటలోని సురేష్ కుటుంబం కుటుంబ సభ్యులకు గుడ్‌సీడ్ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణా రావుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయ కులు సాధనాల శ్రీను, ఎంపిటిసి సభ్యులు మాకే కృష్ణమూర్తి, విక్రమ్, పోతుల సత్యనారాయణ, పోతుల రఘు, జంగా సత్తిబాబు, చొప్పెల్ల మధు, పినిపే ప్రకాష్, మర్రి రత్న కుమార్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

55 మందికి కంటి వైద్య పరీక్షలు


ప్రజాశక్తి - రామచంద్రపురం

కూళ్ల గ్రామ పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి చే ఏర్పాటుచేసిన ఈ శిబిరం లో 55 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారిని ఆపరేషన్ల నిమిత్తం తరలించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు .



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కార్టూ'నిజం'





అల్లవరంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచుల నిరసన

వర్గీకరణను వ్యతిరేకిస్తూ వాకౌట్

ప్రజాశక్తి - అల్లవరం

అల్లవరం మండలం సర్వసభ్య సమావేశం ఎంపిపి యిళ్ళ శేషగిరిరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశం ప్రారంభం అయిన వెంటనే ఎస్‌సి వర్గీకరణను నిరసిస్తూ ఎస్‌సి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు ఎంపిడిఒ కృష్ణమోహన్‌కు వినతి పత్రాన్ని అందజేసి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి మిగతా సభ్యులు సహకరించాలని కోరడంతో మిగతా సభ్యులు, అధికారులు సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు ప్లే కార్డులు ప్రదర్శిస్తూ ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గూడాల గ్రామపంచాయతీ సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు మాట్లాడుతూ రాజకీయ ఉద్దేశంతో దేశంలో ఎన్‌డిఎ ప్రభుత్వం, ఎపిలో టిడిపి కూటమి ప్రభుత్వం, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కోసం ఎస్‌సిలను విభజించి హడావుడిగా ఈ వర్గీకరణ అంశాన్ని తీర్మానం చేసి అసెంబ్లీలో ప్రవేశపెట్టాయన్నారు. ఈ సమావేశానికి వైస్ ఎంపిపిలు వడ్డీ గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ కో ఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్, మండల సర్పంచుల సమక్ష అధ్యక్షులు సాధన వెంకటరావు, ఎంపిడిఒ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలోనూ వాకౌట్...

అయినవిల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ అమలు చేసేందుకు ప్రయత్నించటాన్ని దళిత ప్రజాప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. మండల పరిషత్ బడ్జెట్ సమావేశం నుంచి వారంతా వాకౌట్ చేసి నిరసన వ్యక్తం చేశారు.సుప్రీంకోర్టు సూచనలు పాటించకుండా ఎస్‌సి ఉపకులాల అధీకత జనాభా లెక్కలు లేకుండా రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ఎస్‌సి వర్గీకరణకు పాల్పడటాన్ని దళిత ప్రజాప్రతినిధులుగా వ్యతిరేకిస్తున్నట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బయ్యాచినబాబు ప్రకటించారు. అనంతరం మండలంలోని దళిత సర్పంచ్ లు ఎంపిటిసిలు వాకౌట్ చేసారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా జరిగే ఎస్‌సి వర్గీకరణను తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కాశి వీర వెంకట సత్యనారాయణ, పంబల కుమారి, కుమ్మరి మాధవి, ఎంపిటిసి సభ్యులు గుర్రాల రమాదేవి రాంబాబు,చల్లా బత్తుల సాయి లక్ష్మి ,పచ్చిమాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - అంబాజీపేట



బాధితులకు అందజేస్తున్న ఎంఎల్‌ఎ గిడ్డి

వక్కలంక గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన ముక్కామల సూర్య కాంతం, కేశనకుర్తి లక్ష్మీ కుటుం బాలకు రెవిన్యూ నుంచి కుటుంబానికి 10 కేజీలు, మరో 25 కేజీల 2 ప్యాకెట్ లు బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు శుక్రవారం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. నిరాశ్ర యులైన రెండు కుటుంబాలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని తహశీల్దార్ సిహెచ్.వెంకటేశ్వరరావును ఎంఎల్‌ఎ ఆదేశించారు. ప్రభుత్వ పరంగా బాధితులకు అండగా ఉంటామని ఎంఎల్‌ఎ ఆయా కుటుంబాలకు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి పెదబాబు, టిడిపి కో కన్వీనర్ డివివి.సత్య నారాయణ, గుడాల ఫణి, డి.సాయికృష్ణ, పెదపూడి శ్రీను, చిన్నం బాల విజయా రావు, మైపాల తాతాజీ, యనమదల రాజబాబు, నేదునూరి కళ్యాణ్, ఎన్.వెంకట రమణ, సుంకర గణపతిరావు, ఎల్.శ్రీనివాస్, కె.రాం బాబు, జి.చిన్న, వై.సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.


వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

వచ్చే సీజన్ యందు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలు, జాగ్రత్తలు గూర్చి ఆరోగ్య సిబ్బంది, ఆశాలకు మలేరియా జిల్లా అధికారి నక్కా వెంకటేశ్వర రావు సూచనలు చేశారు. పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పేరూరు-4 సచివాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గత వర్షకాలం సీజన్‌లో డెంగీ జ్వరాలు ప్రబలిన కొంకాపల్లి ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. అనంతరం స్థానిక గహాలను సందర్శించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన ఆయన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రామారావు, ఎంపిహెచ్ఇఒ సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.20 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు



దాతకు స్వామి వారిచిత్రపటం అందజేత

అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు లంకల గన్నవరం వాసులు డొక్కా సుబ్బారావు అన్నపూర్ణ దంపతులు శుక్రవారం రూ.20,032 విరాళం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. ఆలయ అర్చకులు దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, అందజేశారు.



గోగన్నమఠంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలలో చేరికలకు స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి -మామిడికుదురు

గోగన్నమఠంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు శుక్రవారం దృష్టి సారించారు. ఎంఇఒ-2 మోకా వెంకన్న బాబు ఆధ్వర్యంలో ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం భావిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యా యులు ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించా లని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లూ విజయ లక్ష్మి, స్కూల్ కమిటీ ఛైర్మన్ చింత శ్రీనివాస్, సిఆర్‌పిలు సిర్రామణి కుమార్, నాసర్ బాబు, మాజీ సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

వేసవిలో తాగునీటి ఎద్దడి ప్రాంతాలను గ్రామంలో గుర్తించి ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని అందిస్తున్నట్టు సర్పంచ్ కుంచే బుల్లియ్య(బాబాయ్) తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి ప్రాంతాలైన బెస్తాయిపేట,పెద చెరువు ప్రాంత ప్రజలకు శుక్రవారం వాటర్ ట్యాంకర్ ద్వారా సర్పంచ్ బుల్లియ్య ఎంపిడిఒ పిఆర్‌సి.రాజ్ కుమార్ లు అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి డి.బాల బాలాజీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎస్ఐ రమణారెడ్డికి ఎస్ఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రమణారెడ్డికి ఎస్ఐగా ఉద్యోగోన్నతి లభించింది. ఇటీవల ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ పలువురికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇందులో ఆలమూరు ఎఎస్ఐ రమణారెడ్డి ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు రమణారెడ్డి రావులపాలెం అదనపు ఎస్ఐగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రావులపాలెం పట్టణ అదనపు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించేందుకు వెళ్లారు. దీంతో స్థానిక సిఐ ఎం.శేఖర్ బాబు ఆహ్వానించి అభినందించారని రమణారెడ్డి ఆలమూరు విలేకరులకు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా భీమ శంకరరావు

ప్రజాశక్తి - ఆలమూరు



భీమ శంకరరావు

ఆలమూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 7న నిర్వహించాల్సి ఉంది. కానీ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ఏకగ్రీవం కావడంతో శుక్రవారం బార్ అసోసియేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందులో అధ్యక్షులుగా కె.భీమ శంకరరావు, ఉపాధ్యక్షులుగా ఎం.కృపావరం, ప్రధాన కార్యదర్శిగా జి.రాజశేఖర్, కార్యదర్శిగా బి.మహాలక్ష్మి, కోశాధికారిగా ఏ.గోవిందరాజు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రధాన ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ప్రముఖ లాయర్ అంగర విందు మాధవరావు, ఉప ఎన్నికల అధికారి ప్రముఖ లాయర్ మాత మహేశ్వరరావులు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు భీమ శంకరరావు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తూ, కక్షిదారులకు పరిపూర్ణమైన న్యాయం అందించేందుకు బార్ అసోసియేషన్ కట్టుబడి పనిచేస్తుందని అన్నారు.

జాబ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమలాపురం

ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా నందు 2025-2026 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి మొదటి త్రైమాసికానికి ఏడు నియోజకవర్గాల పరిధిలో నిర్వహించనున్న జాబ్ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శుక్ర వారం క్యాంప్ కార్యా లయం నందు ఆవిష్క రించారు. ఈ సందర్భంగా జిల్లా నైపు ణ్యాభివృద్ధి అధికారి హరిశేషు మాట్లాడుతూ ఏప్రిల్ 4న అమలా పురంలో నియోజకవర్గం లో జాబ్ మేళా నిర్వహించామని, ఏప్రిల్ 17న పి.గ న్నవరం నియోజక వర్గంలో, మే 2న మండపేట నియోజక వర్గంలో, మే 16న కొత్తపేట నియోజకవర్గంలో, మే 23న ము మ్మిడివరం నియోజక వర్గంలో, జూన్ 6న రాజోలు నియోజకవర్గంలో, జూన్ 13న రామచంద్రపురం నియో జవర్గంలో ఈ జాబ్ మేళాలు నిర్వహించడా నికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాసా జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబంలో పారిశ్రామిక వేత్తను తయారుచేయాలి

యువత పారిశ్రామిక వేత్త లుగా ఎదిగేలా చర్యలు చేపడుతూ ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయా లని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ కమిటీ సభ్యులకు పిలుపు నిచ్చారు. స్థానిక కలెక్టరేట్లో 13వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సా హక కమిటీ (డీఐఈపీసీ) స మావేశం శుక్రవారం జిల్లా కలెక్టర్ కమిటీ చైర్మన్ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి దార్శనిక తతో, వేగవంతమైన పారిశ్రామికాభివద్ధి లక్ష్యంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందన్నారు ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ రమణా రెడ్డి మత్స్యశాఖ జెడి జివి.శ్రీనివాసరావు, పరిశ్ర మల కేంద్రం సహా య సంచాలకులు శివరాం ప్రసాద్, ఎల్‌డి ఎం.కేశవ వర్మ, సిడ్బి ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు, వివిధ శాఖలకు చెందిన అధికా రులు తదితరులు పాల్గొ న్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

నేరాలు ఘోరాలు

మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అనధికారంగా మద్యం విక్రయాలు చేస్తున్న గూడాల గ్రామానికి చెందిన కొమ్ములు వీరబాబు, సాకురు గ్రామంకి చెందిన బొక్కా నరసింహమూర్తి అనే వ్యక్తుల నుంచి ఒక్కొక్కరి వద్ద 4 సీసాల చొప్పున మొత్తం 8 మద్యం సీసాలను స్వాధీన పరుచుకుని ఇరువురిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. అలాగే అమలాపురం మండలం బండారులంక గ్రామానికి చెందిన దొమ్మేటి వెంకట ప్రవీణ్‌ను అమలాపురం మండల తహాశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు అమలాపురం ఎక్సైజ్ ఎస్ఐ విటివివి.సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారులో రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం అల్లూరి గ్రామానికి చెందిన బాడవుల కేదార మణిక్యం (21) రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి గురువారం రాత్రి ప్రత్తిపాడు మండలం ధర్మవరం వెళ్లి తిరిగి వస్తుండగా గండేపల్లి గ్రామ శివారున మరో బైకు ఢీకొనడంతో మాణిక్యం తీవ్రంగా గాయపడగా జిఎస్ఎల్ ఇసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. బైకుపై ప్రయాణిస్తున్న మరో వ్యక్తి విష్ణువర్ధన్ గాయాలతో బయటపడ్డాడు. విష్ణువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ శివనాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె వరసైన యువతిపై అత్యాచారం

ప్రజాశక్తి-కరప

వేళంగి గ్రామానికి చెందిన ఒక కామాంధుడు కూతురు వరసైన యువతిపై అత్యాచారం చేసినట్టు అతడి భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్క్మై టి.సునీత తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వేళంగి గ్రామానికి చెందిన ఒక మహిళకు వివాహం అయ్యింది. ఆమె అక్క చనిపోవడంతో ఆమె కుమార్తెను ఇంటిలో ఉంచి పెంచుకుంటోంది. ఈ నెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహిళ భర్త యువతిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. యువతి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి తలుపు కొట్టగా తలుపు తెరిచి అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో నిందితుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ జిజిహెచ్‌ను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జిజిహెచ్)ను అభివృద్ధి చేసేందుకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించారు. తాజాగా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం లోక్‌సభ జీరో అవర్లో కాకినాడ జిజిహెచ్ అభివృద్ధి గురించి ఆయన ప్రస్తావించారు. అనేక దశాబ్దాలుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రాణదారంగా నిలవడంతో పాటు భవిష్యత్తు తరాలకు వైద్య నిపుణులను అందిస్తున్న రంగరాయ వైద్య కళాశాలకు బోధనాసుపత్రిగా పని చేస్తోందని ఆయన తెలిపారు. ఆసుపత్రిలో సాధారణ సేవలతో పాటు, కీలకమైన కార్డియాలజీ, అంకాలజీ, న్యూరో సర్జరీ వంటి ప్రత్యేక విభాగాలు ఉన్నప్పటికీ సిబ్బంది కొరత, ఆధునిక పరికరాల కొరత, సరైన వసతులు లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. గతంలో క్యాన్సర్ చికిత్సలో రాష్ట్రంలోనే అగ్రగామిగా పేరుగాంచిన కాకినాడ ఆసుపత్రి నేడు వసతుల లేమితో రోగులకు ఆధునిక వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కాకినాడ జిజిహెచ్‌ను ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన కింద అభివృద్ధి చేయడంతో పాటు ఆసుపత్రిని సంపూర్ణ క్యాన్సర్ చికిత్స కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్వా జోన్ల ఏర్పాటుకు గ్రామ సభలు

ప్రజాశక్తి-కాజులూరు, కరప

కాజులూరు మండలంలో ఆక్వా జోన్లు ఏర్పాటుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల మత్స్యశాఖ సహాయ అధికారి సుహాసిని తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ఈ నెల 7 నుంచి 11 వ తారీకు వరకు ఆక్వా జోన్లు ఏర్పాటుపై గ్రామ సభల వివరాలు వెల్లడించారు. కాజులూరు, పల్లిపాలెం, కోలంక, ఉప్పుమిల్లి, మంజేరు, నామవానిపాలెం, ఆండ్రంగి, దుగ్గుదుర్రు, కుయ్యేరు, శీల, పెనుమల్ల, తనుమల్ల, ఆర్యవటం, ఐతపూడి, గొల్లపాలెం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని తెలిపారు. నాన్ ఆక్వా జోన్‌లోని చెరువుల యజమానులు గ్రామ సభలకు హాజరై తమ చెరువులకు సంబంధించి ధ్రువపత్రాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, సురేంద్ర పాల్గొన్నారు. **కరప** మండలంలోని వివిధ గ్రామాల్లో ఆక్వా జోన్ల ఏర్పాట్లకు గ్రామ సభలో నిర్వహిస్తున్నట్లు మత్స్య శాఖ అధికారులు ఆర్.నూకరాజు, కె.మధుబాబు తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు అరటకట్ల, జెడ్.భావవరం, కొరిపిల్లి, వేములవాడ, కరప, వేళంగి, కూరాడ, చిన్నమామిడాడ, యండమూరు, ఉప్పలంక, పెనుగుదురు, నడకుదురు, సిరిపురం, పెద్దాపురంపాడు, కొంగోడు, పాతర్లగడ్డలో సభలు నిర్వహిస్తామన్నారు.

ఉపాధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని మర్రివీడు, జె.అన్నవరం తూర్పు లక్ష్మీపురం, రమణయ్యపేటలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పశువుల తొట్ల నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులకు ఎంపిపి గొల్లపల్లి బుజ్జి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరం మర్రివీడులో ధాన్యం తేమ కొలిచే యంత్రం, లింగంపర్తి, సిరిపురం, ఎర్రవరం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, ఆయా గ్రామ సర్పంచులు, ఎంపిడిఒ కెవి.సూర్య నారాయణ, వ్యవసాయ అధికారి బి.జ్యోతి, ఎపిఒ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అంబటి భవాని

మండలాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి అంబటి భవాని అన్నారు. రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. సభలో వేగాయమ్మపేట సర్పంచ్ రెవెన్యూ సదస్సులో సమస్యలు పరిష్కారం కాలేదని గ్రామానికి 50 నుండి 100 వరకు దరఖాస్తులు వెళ్ళగా కేవలం ఆన్లైన్లో తొమ్మిదింటిని నమోదు చేయడమేమిటని ప్రశ్నించారు. రెవెన్యూ సదస్సులో సమస్యలు పరిష్కారానికి తీవ్ర జాప్యం జరుగుతుందని మూడు నాలుగు నెలలు కార్యాలయాలు చెట్టు తిరగవలసి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులు కషి చేయాలని సమస్యలు ప్రస్తావించిన పరిష్కారం కావడం లేదని మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిపి మాట్లాడుతూ డ్వాక్రా మహిళల నుండి మనిషికి రూ.300 చొప్పున గ్రూపునకు రూ.3 వేలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. వసూలు చేసిన సొమ్ములు యానిమేటర్ల ద్వారా గ్రామ సమాఖ్యలకు అప్పచెప్తున్నారని వీటిని ఎలా ఖర్చుపెడుతున్నారు అంటూ నిలదీశారు. అయితే మహిళా సమాఖ్య వెలుగు ప్రాజెక్టుల నుండి ఎవరు సమావేశానికి హాజరు కాలేదు. అదేవిధంగా స్వచ్ఛభారత్ క్లీన్ గ్రీన్ కార్యక్రమాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని అయితే వాటి నిర్వహణకు నిధులు ఎక్కడివని ప్రశ్నించారు. స్వచ్ఛభారత్ లో పనిచేస్తున్న సిబ్బందికి రూ. 6000 జీతానికి ఎవరు రావడంలేదని సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సచివాలయ వ్యవస్థ వల్ల సర్పంచులకు ఒరిగిందేమీ లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆర్డబ్ల్యుఎస్ పథకాలు గ్రామాల్లో సక్రమంగా అమలు కావడం లేదని రెండేళ్లుగా పనులు పూర్తిగా లేదని వెంకటయ్యపాలెం సర్పంచ్ ఎల్లమల్లి సతీష్ కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు గ్రామంలో డ్రెయినేజీలు, రోడ్లు తవ్వడం వల్ల మంచినీటి పైపులైన్లు దెబ్బతిన్నాయని ప్రస్తుతం పలుచోటలకు మంచినీళ్లు సరఫరా కావడం లేదని సభలో తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రాహుల్ మాట్లాడుతూ పనులను జూలై నాటికి పూర్తి చేస్తా మని వివరించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు,, మండల ఉపాధ్యక్షులు శాఖా బాబి, నరాల రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ పద్మజ్యోతి, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భవాని

మండల సమావేశానికి పలువురు అధికారులు డుమ్మా

అసెంబ్లీ తరహాలో ప్రతి మూడు నెలలకు మండల పరిషత్తులో జరిగే సర్వసభ్య సమావేశం పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. శుక్రవారం రామచంద్రపురం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు అధికారులు రాకపోవడంతో ప్రజాప్రతినిధులు అయోమయాన్ని గురయ్యారు. సమావేశానికిరాని అధికారులకు నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ఆర్‌టిసి అధికారులు, సోషల్ వెల్ఫేర్, పౌరసరఫరాల శాఖ, వెలుగు ప్రాజెక్ట్ అధికారులు ఐకెపి సిబ్బంది, డ్రెయినేజీ శాఖ అధికారులు, ఆర్అండ్‌బి అధికారులు, బీసీ వెల్ఫేర్ అధికారులు, హాజరు కాలేదు.

ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - మామిడికుదురు

స్థానిక పెర్ల కాలువ గట్టు రామాలయం వద్ద నూతనంగా అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సుదర్శనం వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కోదండరామ అభ్యుదయ యువజన సంఘం ఆధ్వర్యంలో బత్తుల నాగన్న నాగమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు సత్యనారాయణమూర్తి(పెద్ద), పెద్దిరాజుల ఆర్థిక సహాయంతో అన్నదానం చేశారు.

భూమి కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - అమలాపురం

పి. గన్నవరం మండలం ఉడుమూడి గ్రామస్తుడు కడిమి సంపదరావు కలెక్టర్ కార్యాలయంలో తన భూమిని కబ్జా చేశారని శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఉడుమూడి గ్రామ పంచాయతీ పరిధిలో జీవిస్తున్న తనకు 1992 నాటి ప్రభుత్వం డి పామ్ పట్టా ద్వారా 0.28 సెంట్ల భూమి అప్పటి అధికారులు ఇచ్చారని సంపదరావు తెలిపాడు. అప్పటి నుంచి 33 ఏళ్ళ గా భూమి ఆయన స్వాధీనంలోనే ఉందని ఆ భూమిని కుటుంబ ప్రయోజనం కోసం నేను ఉపయోగించుకుంటున్నానని అన్నారు. 2009 వరకు భూమీ పన్ను కూడా కట్టానని నేటివరకు అంతా సక్రమంగా గానే ఉందన్నారు. అయితే గత ఫిబ్రవరి నెలలో అదే గ్రామానికి చెందిన సికిలే వెంకన్న అతని కుటుంబ సభ్యులతో కలిసి సంపద రావు స్థలంలోకి చొరబడి కొంత భాగాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేశారన్నారు. దీనిని అడ్డుకున్నానని అందుకు వారు తనపై దాడికి పాల్పడ్డారని సంపద రావు తెలిపారు. పి.గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇది సివిల్ సమస్య అని తహశీల్దార్‌కు మా పిర్యాదును బదలాయించినారన్నారు. తహశీల్దార్ ఒకసారి వచ్చి ఇరువురిని ఆ స్థలంలోకి వెళ్లొద్దని చెప్పినారని అప్పటినుండి నేటి వరకు సమస్యకు పరిష్కారం జరగలేదన్నారు. అధికారులు కూడా నాకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా ఉన్నప్పటికీ 2009 వరకు పన్ను కట్టినప్పటికీ నాకు న్యాయం చెయ్యడం లేదని నాకు అన్యాయం చేస్తున్నారనే సందేహం కలుగుతుందన్నారు. శుక్రవారం కడిమి సంపదరావు అతని కుటుంబ సభ్యులు కలెక్టర్‌ని కలసి న్యాయం చేయాలని సికిలే వెంకన్న కుటుంబ సభ్యులు నుంచి రక్షణ కల్పించాలని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఈ కార్యక్రమంలో సంపద రావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వర్గీకరణ నేపథ్యంలో ఎంఎల్ఎకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - సీతానగరం

వర్గీకరణకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో శుక్రవారం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణను ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణ అంశం ఈ స్థాయి వరకు రావడానికి మంద కృష్ణ కృషే కారణమన్నారు. ఎస్సి వర్గాల్లో ఉన్న లోటుపాట్లు సవరించి వర్గీకరణ అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

రాజానగరం నియోజకవర్గంలో రెండు కొనుగోలు కేంద్రాలను ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ శనివారం ప్రారంభించనున్నారు. ఉదయం పది గంటలకు సీతానగరం మండలం చినకొండెపూడి రైతు సేవా కేంద్రం వద్ద, పదకొండు గంటలకు కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం గ్రామంలోని రైతు సేవా కేం ద్రం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభిస్తారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రబీ-2025 ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక అధికారులు, సిబ్బందిదేనని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ధాన్యం రైస్ మిల్లర్లు, సొసైటీ సెక్రటరీలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విఆర్ఓలు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సిఎస్ డిటి ఎస్ఎస్ఎస్.రెడ్డితో కలిసి అవ గాహన కల్పించారు. గోనె సంచుల పంపిణీ, నాణ్యత విషయాల్లో ఎటువంటి లోపాలు లేకుండా చూసు కోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే ఉన్నతా ధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి గింజ కొనుగోలుచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

3 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం కొత్తపేటలో గండి పోశమ్మ దేవాలయం వద్ద శుక్రవారం 3వేల మందికి అన్నదానం నిర్వహించామని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయం నిర్మించి, సంవత్సర కాలం అయిన సందర్భంగా రెండు రోజులు జాతర జరిగిందన్నారు. జాతర ముగింపు నేపథ్యంలో అన్నదానం చేశామన్నారు. గ్రామస్తులతోపాటు, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 294 మంది హాజరు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో వివిధ కార్పొరేషన్ల పరిధిలో రుణాల మంజూరు కోసం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 341 మందికి 294 మంది హాజరయ్యారని ఎంపిడిఒ తెలిపారు. యూనియన్, ఎస్‌బిఐ మేనేజర్లు ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరిగాయన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రైతులకు సాగులో రైతులకు మేలైన ఆధునిక పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఏరువాక కేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని ఏరువాక కేంద్రం డైరెక్టర్ ఆఫ్ ఎక్సటెన్షన్ డాక్టర్ జి శివన్నారాయణ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని ఏరువాక కార్యాలయం నందు శుక్రవారం జిల్లా స్థాయి రెండో సమన్వయ కమిటీ సమావేశం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ గిరిజా రాణి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శివన్నారాయణ రైతులనుద్దేశించి మాట్లాడుతూ సాగులో వస్తున్న సాంకేతికతను క్షేత్ర స్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని వివరించారు. ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం. నంద కిషోర్ మాట్లాడుతూ గత ఏడాది కాలంగా అమలు వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం అభ్యుదయ రైతులు సాగులో ఎదురయ్యే పురుగులు, తెగుళ్ళ నివారణపై అడిగిన సందేశాలను నివతి చేశారు.జిల్లా వ్యాప్తంగా సాగులో రైతులు ఎదుర్కొంటున్న డ్రెయినేజీ, ముంపు సమస్యల పై సమావేశం చర్చించి పరిష్కారానికి పలు సూచనలు ప్రతిపాదించారు. ఈ సమావేశంలో ఏరువాక కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.


ఏరువాక కేంద్రం సమన్వయ కమిటీ సమావేశం

రుణాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల వివిధ ఒసి,బిసి కార్పొరేషన్ రుణాలకు సంబంధించి లబ్ధిదారులకు శుక్రవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

కాట్రేనికోన: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఒసి, బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపిడిఒ వెంకటాచలం పేర్కొన్నారు. వెనుకబడిన 1177 మంది లబ్ధిదారులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగా 910 మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్లకు సంబంధించిన మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** బిసి,కాపు కార్పొరేషన్ రుణాలకు శుక్రవారం జరిగిన ఇంటర్వ్యూ లకు 512 మంది హాజరైనట్లు ముమ్మిడివరం ఎంపిడిఒ టిఎస్.వెంకటాచార్య తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలోని 5 బ్యాంకుల ద్వారా యూనిట్లు మంజూరుకు శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ వెంకటాచర్య ఆధ్వర్యంలో జరిగాయి. .ఈ ఇంటర్వ్యూలలో ఆయా బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు. బిసి, కాపు మరియు ఇబిసి కార్పొరేషన్లకు దరఖాస్తు చేసుకున్న గ్రూప్ యూనిట్లకు ఈ నెల 8న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. **ఆలమూరు:** కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఐ.రాజు ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాంక్ అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు పూర్తి చేశారు. మొదటి రోజున 379 మంది దరఖాస్తు చేసుకుని 296 మంది హాజరయ్యారన్నారు. అలాగే రెండవ రోజున 378 మంది దరఖాస్తు చేసుకుని 278 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, కార్యదర్శులు బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురు మండలంలో 7,8 తేదీలలో..

మామిడికుదురు: వివిధ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 7,8 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు తెలిపారు మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో స్క్రీనింగ్ సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 7న ఉదయం 10 నుంచి 1 గంట వరకు కరవాక, గోగన్నమఠం, లూటుకుర్రు, ఆదుర్రు, కొమరాడ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంట ల వరకు మగటపల్లి, మాకన పాలెం, గెద్దాడ, ఈదరాడ గ్రామాలకు. 8న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మామిడి కుదురు, మొగలికుదురు, నగరం, పాశర్లపూడి, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు అప్పనపల్లి, బి దొడ్డవరం, పాశర్లపూడిలంక, పెదపట్నం, పెదపట్నం లంక గ్రామాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రామచంద్రపురం

మున్సిపాలిటీ పరిధిలో రూ.16.53 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపల్ సాధారణ నిధులతో ఈఅభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వెల్ల లోని హెడ్ వాటర్ ట్యాంక్ ముఖద్వారం గేటు, మరమ్మతులకు రూ. 4.99 లక్షలు, 2 వార్డ్ స్టీల్ వెల్ పేటలో రూ.5 లక్షలతో సిసి రోడ్డు, లలిత నగర్ 16 వార్డులోని సిసి రోడ్డు నిర్మాణానికి రూ.3.30 లక్షలు, శాంతినగర్ 9వ వార్డులో డ్రెయినేజీకి రూ.3.24 లక్షల తో పనులు చేపడతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ శ్రీకాంత్, ఎఇలు, కూటమి పార్టీ నాయకులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఆలమూరు ఎఎంసి చైర్మన్‌గా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - ఆలమూరు


వెంకటలక్ష్మి

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మండలంలోని మడికికి చెందిన కొత్తపల్లి వెంకట లక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని కూటమి ప్రభుత్వ ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించారు. ఎఎంసి ఛైర్మన్ పదవి ఒసి మహిళాకు రిజర్వేషన్ చేయటంతో జనసేన పార్టీ వెంకటలక్ష్మిని ఎంపిక చేసింది. ఈమె గతంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలుగా పనిచేశారు. ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన వెంకటలక్ష్మికి శుక్రవారం పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు..

In the Court of the Hon'ble Civil Judge (Junior Division), Amalapuram
O.S. No. 143 of 2018

Between:
Coastal Area Bank Ltd., Amalapuram Branch, Rep. by its Branch Manager ***...Plaintiff***

Vs

Patnala Rambabu, S/o. Lakshmayya, D.No. 3-3-23/9, Narayanapeta, Amalapuram ***...1st Defendant***

The above named plaintiff has instituted the above suit against you, and the same stands posted to **28-04-2025 at 10.30 A.M** for your appearance, your are hereby required to appear personally or through advocate attend before this Hon'ble Court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.

//By the Orders of the Hon'ble Court//

D.V.V.S.MURTHY
Amalapuram — Advocate, Amalapuram
Dt.02-4-2025 — Cell: 98483 44577

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టులో
ఓ.ఎస్.నెం: 60/2024

బిట్వీన్:-
వాది: దండు కృష్ణరాజు
మరియు
ప్రతివాది: కర్రీ జగదీశ్వర రెడ్డి

పై నెంబరు దావా గ్రంధములలో మీ పై అనగా కర్రీ జగదీశ్వర రెడ్డి S/o వరాహావ రెడ్డి, పురుషుడు, వయస్సు 50 సం॥, వ్యాపారం, నివాసం D.No: 8-239, రామిరెడ్డి నగర్, అనపర్తి, అనపర్తి మండలం, ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ ఆంధ్రప్రదేశ్-533 342 అనువారుపై ఎన్ని పర్యాయములుగా దావాసమన్లు పంపించినచో తీసుకొనకుండ తప్పించుకుని తిరుగుచున్నారు. గనుక కోర్టు వారు దావాసమన్లు అమలు నిమిత్తం ప్రజాశక్తి పేపర్లో వేయవలసిందిగా కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కనుక **ది. 25-04-2025వ తేది ఉదయం 10-30 ని॥లకు** కోర్టుకు వచ్చి మీరు గాని, మీ ప్లీడర్ గారి ద్వారా గాని మీ వాదనను వినిపించగలరు. లేనిచో కోర్టు వారు మీపై తీసుకునే తగు చర్యలు బాధ్యులై ఉన్నారు.

గంగిరెడ్ల సాయి కృష్ణ ప్రసాద్
తాడేపల్లిగూడెం — అడ్వకేట్
తేది: 04-04-2025 — తాడేపల్లిగూడెం
ఫోన్: 98483 77977

మహారాజశ్రీ అమలాపురం 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A. 694/2024, I.A. 695/2024, I.A. 696/2024
M.V.O.P. 127/2016

Between:
పెనుమళ్ళ సత్య లక్ష్మి మరియు ఇతరులు **-పిటీషనర్లు**
మరియు
టి.వి.హనుమంతరావు (died) మరియు ఇతరులు **-రెస్పాండెంట్లు**

R-3: మానుగుంట ప్రభావతి, D/o. వెంకట హనుమంతరావు (లేటు), R/o. గంటా వీధి, ముమ్మిడివరం, ముమ్మిడివరం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

R-4: మానుగుంట కిరణ్‌శ్రీ, D/o. వెంకట హనుమంతరావు (లేటు), R/o. గంటా వీధి, ముమ్మిడివరం, ముమ్మిడివరం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పై నెంబరు కేసులో 1వ రెస్పాండెంట్ అయిన మీ తండ్రి గారు మరణించినందున పిటీషనర్లు దాఖలు చేసుకున్న IA 694/2024 (U/S 5 of limitation Act), IA 695/2024 (U/Or 22 R4, U/Or 6 R 17 CPC and Rule 28 CRP), I.A 696/2024 (U/Or 22 R 9 CPC) కింద పిటీషనర్లు దాఖలు చేసిన పిటిషన్‌లలో మీ హాజరు నిమిత్తం **ది. 21-04-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా: 21-04-2025

పెయ్యల సత్యనారాయణ
అమలాపురం — ఎన్.సి హెచ్.వి.రావు
ది. 02-4-2025 — అడ్వకేట్స్, అమలాపురం

In The Court Of The Senior Civil Judge (Senior Division) Court Tadepalligudem. W.G.Dt
I.A.No. 463/2025 in I.A.No.1228/2023 O.S.No. 317/2015

Between:
Sri Talamsetti Srinivasa Rao **...Petitioner/Plaintiff**

And

1. Sri Devina Surya Chandra Rao (died) and 3 others **...Respondents/Defendants**

Proposed Parties
3rd and 4th Respondents/Defendants

R3. Sri Deevina Rajsh @ Raju
S/o.Deevina Surya Chandra Rao, (died), Hindu, Male, Aged 35 years, Business, resident of D.No. 4-83, Ananthapalli (V), Nallajerla Mandal, E.G. District, TPG/SCJC.

R4. Sri Deevina Ravi
S/o.Deevina Surya Chandra Rao, (died), Hindu, Male, Aged 33 years, Business, resident of D.No. 4-83, Ananthapalli (V), Nallajerla Mandal, E.G. District, TPG/SCJC.

పైన తెలుపబడిన దావా గ్రంధములో 3వ రెస్పాండెంట్ మరియు 4వ రెస్పాండెంట్ లకు శ్రీ కోర్ట్ వారు మిమ్ములను పైన పేర్కొన్న కోర్ట్ కి హాజరు కమ్మని, అనేక పర్యాయములు కోర్ట్ మరియు పోస్టల్ ద్వారా పై నెంబరు పిటిషన్లో నోటీస్‌లు పంపినను, మీరు ఉద్దేశ్య పూర్వకముగా శ్రీ కోర్ట్ వారు పంపిన నోటీస్‌లు తీసుకొనుటలేదు అందుచేత శ్రీ కోర్ట్ వారి ఆర్డరు ప్రకారము ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది మీరు **ది.21-04-2025 సం.తేదిన ఉదయం 10-30 ని॥లకు** పై కోర్ట్ వారి ఎదుట మీరు స్వయముగా గాని, లాయరు గారి ద్వారా గాని పైన పేర్కొన్న కోర్ట్‌కి హాజరై మీ అభ్యంతరాలను తెలియపరుచుకొనవలెను. లేని యెడల ఎక్స్ పార్టీ చేచి మీ పరోక్షమున తీర్మానించడమగును.

వాయిదా: 21-04-2025

Andugula. Subhakara Rao
Tadepalligudem — Advocate,
Dt. 05-04-2025 — Tadepalligudem
Cell No: 94401 05513

In the Court of the Principal Senior Civil Judge, Kakinada
O.S. 151/2021

Between:
1. M.Balaji Babu
2. Pasupuleti Prem Kumar

...Plaintiffs

AND

1. Kosireddy Gurumurthy Naidu
2. Thota Rama Rao (died) & 3 Others

...Defendants

To:
5th Defendant:
Perneedi Satyaveni, W/o. Sathi Raju, age 58 years, D.No. 70-17A-25/11/1, Soujanya Nagar, Kakinada, Kakinada Dist.,

పై నెంబరు దావాలో 5వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 23-4-2025వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

D.SURYANARAYANA MURTHY
V.VIJAYARAJ KUMAR
V.KONDALA RAO
Advocates, Kakinada
Cell: 8247256301, 9177313333

మహారాజశ్రీ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 61/2019

Between:
కొప్పిశెట్టి సూరిబాబు ***-వాది***
AND
కోట వెంకట్రావ్ (died) & 3 అదర్స్ ***-ప్రతివాదులు***

To:
దంగేటి వరలక్ష్మి, W/o. శ్రీనివాస్, వయస్సు 35, గృహిణి, డోర్ నెం. 2-273, తాళ్ళపోడు గ్రామం, కె.గంగవరం మండలం, డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.
-4వ ప్రతివాది

పై నెంబర్ దావాలో 4వ ప్రతివాది అయిన మీరు కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపుతున్నా తీసుకొనక బుద్ధిపూర్వకంగా కోర్టు ప్రొసీడింగ్స్ తెలిసికూడా కాలయాపన చేయుచున్నారు. కావున 4వ ప్రతివాది అయిన మీరు **దివి. 25-4-2025వ తేదీ ఉదయం 10.30లకు** పై కోర్టు నందు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై దావాలో మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ తెలియజేసుకొనవలెను. ఆరోజున మీరు కోర్టుకి హాజరు కాని పక్షంలో మీకు వ్యతిరేకంగా తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

చల్లా సతీష్
ఆలమూరు — న్యాయవాది, ఆలమూరు
ది.4-4-25 — సెల్: 9030314955

మహారాజశ్రీ 6వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 831/2024

Between:
Punjab National Bank (United bank of India prior to amalgamation), Nandam Gani Raju Junction Branch, Rajamahendravaram, Rep. by its Branch Manager ***...Plaintiff***

AND

1. Vighna Raja Cut Pieces, Rep. by its Proprietor, Porpu Suresh Kumar, S/o. Krishna, Hindu, aged 40 years, Business, Shop No. A-12, Karri Sura Reddy Complex, Tadithota, Rajamahendravaram, residing at Door No. 51-10-32, Rajendra Nagar, Rajamahendravaram.

2. Velaga Jagadeeswara Veera Venkata Prasad, S/o. Satti Raju, Hindu, aged 41 years, Employ, residing at Door No. 51-10-32, Rajendra Nagar, Rajamahendravaram.

,,,1, 2 Defendants

పై నెంబరు దావాలో 1, 2 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 23-4-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.ఎస్.లక్ష్మినారాయణ, అడ్వకేట్
రాజమండ్రి — లాలాచెరువు, రాజమండ్రి
04-4-2025 — సెల్:9848033710